క్లుప్తంగా...

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: ప్రభుత్వ ఐటీఐలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్ మోటార్ వెహికల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఫిట్టర్, పెయింటర్, వెల్డర్, కోపా ట్రేడ్‌లకు సంబంధించి మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం మూడో విడత దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించడం జరుగుతుందన్నారు. పది ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆయా ట్రేడ్‌లలో చేరాలనుకునేవారు iti.te langana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి లేదని పూర్తి వివరాలకు 89191 90943, 98859 66522 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పర్యటన

సికింద్రాబాద్: బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్ సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తారని నియోజకవర్గ అధ్యక్షుడు బక్కూరి నర్సింగ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో బీఎస్పీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని అందులో భాగంగానే ఈ నెల 21న(సోమవారం) నియోజకవర్గంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటించి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తారన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మధుబాబు

లాలాపేట: ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సోషల్ వర్కర్, సికింద్రాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పి.మధుబాబు అన్నారు. మధుబాబు ఆధ్వర్యంలో మెడికోవర్ హాస్పిటల్స్ సహకారంతో శనివారం తార్నాక డివిజన్ శాంతినగర్ చౌరస్తాలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సమీర్, హాస్పిటల్ మేనేజర్ జానకీ శ్రీధర్, సిబ్బంది అఖిల, పూజ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌కు 'నాయిని' పేరు పెట్టడం హర్షణీయం

అడ్డగుట్ట: ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద ప్రారంభించిన ఫ్లైఓవర్‌కు దివంగత నాయిని నర్సింహారెడ్డి పేరు పెట్టడం హర్షణీయమని మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నూతనంగా ఫ్లై ఓవర్ ప్రారంభించారని, దానికి తెలంగాణ హింద్ మజ్దూర్ సభ మాజీ అధ్యక్షులు దివంగత నాయిని నర్సింహా రెడ్డి పేరు నామకరణం చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు హింద్ మజ్దూర్ సభ రాష్ట్ర కమిటీలు, ఏఐఆర్‌ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 30 వాహనాలు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను నడిపిస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. గత మూడ్రోజుల నుంచి గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నంబర్ ప్లేట్లు లేని, రకరకాల హారన్లతో శబ్ద కాలుష్యం చేసే, సైలెన్సర్లను మార్చిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎస్ సైదులు ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది మూడు రోజుల స్పెషల్ డ్రైవ్‌లో 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

లా కాలేజీ ప్రిన్సిపల్ పై ఓఎస్‌డీకి ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఏఎంఎస్ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆరోపిస్తూ అతడిపై చర్యలు తీసుకోవాలని ఓఎస్‌డీ ప్రొ.రెడ్యానాయక్‌కు విద్యార్థి జేఏసీ నాయకులు లెనిన్, కృష్ణ ఫిర్యాదు చేశారు. విజయవాడకు చెందిన లా విద్యార్థి ఓ కంపెనీలో ఫుల్ టైంజాబ్ చేస్తూ రెండు సంవత్సరాలుగా రెగ్యులర్‌గా తరగతులకు హాజరుకావడం కాకున్నా ప్రిన్సిపల్ తప్పుడు అటెండెన్స్ వేసి పరీక్షలకు అనుమతించారని పేర్కొన్నారు. హాజరుశాతం లేకున్నా పరీక్షలకు అనుమతించిన ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకుని సదరు విద్యార్థి అడ్మిషన్‌ను రద్దు చేయాలని వినతిలో పేర్కొన్నారు.

ఉద్యానం.. అధ్వానం

- నిరుపయోగంగా మారుతున్న జీహెచ్‌ఎంసీ పార్కులు
- వాకర్స్‌కు ఇబ్బందులు
- దృష్టి సారించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



జీహెచ్‌ఎంసీ పార్కు దుస్థితి..

లాలాపేట: రకరకాల మొక్కలు, ఆహ్లాదకర వాతావరణం, పిల్లలు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు, వృద్ధులు సేద తీరడానికి బెంచీలు వంటి సౌకర్యాలు పంచాల్సిన జీహెచ్‌ఎంసీ పార్కులు తార్నాక డివిజన్ వ్యాప్తంగా అధ్వానంగా మారాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో పెంట దిబ్బలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. జనవాసాల మధ్య పార్కులు నిరుపయోగంగా మారడంతో క్రిమి కీటకాలు, పాములకు స్థావరాలు మారాయని స్థానికులు వాపోతున్నారు.

క్రిమికీటకాలకు స్థావరంగా..

లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న పార్కు నిర్వహణ లేక పెంటదిబ్బగా మారింది. గతంలో హాస్పిటల్ రోగులు, వారి బంధువులు సేద తీరడానికి లక్షల రూపాయలు వెచ్చించి పార్కు నిర్మాణం చేశారు. ఆ పార్కు నిర్వహణ ఇటు హాస్పిటల్ చూడక, అటు జీహెచ్‌ఎంసీ అధికారులు చూడక నిరుపయోగంగా ఉంది. ఏపుగా పెరిగిన చెట్ల నుంచి దోమలు, క్రిమి కీటకాలు ఆస్పత్రిలోకి వస్తుండటంతో గర్భిణులు, బాలింతలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్వహణ లేక..

తార్నాక, లాలాపేట, వినోభానగర్ తదితర ప్రాంతాల్లో పార్కులు, పార్కు స్థలాల నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. పార్కుల్లోని బెంచీలు విరిగిపోయి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. గేట్లు సైతం పాడైపోయాయి. దీంతో ఇప్పటికే కొన్ని పార్కు స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. వినోభానగర్‌లోని పార్కు స్థలం ప్రస్తుతం కబ్జాదారుల ఆధీనంలో ఉండటం గమనార్హం. ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో పార్కులు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పార్కు స్థలాలను పరిరక్షించి, అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



హాస్పిటల్ పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారం

నా దృష్టికి వచ్చే సమస్యలన్నీ పరిష్కరిస్తున్నా

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ప్రజా సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ ఉదయ్‌నగర్ కాలనీలో శనివారం ఆయన పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని పార్కు అభివృద్ధి, ఓపెన్ జిమ్, చిన్న పిల్లల క్రీడా సామాగ్రిని ఏర్పాటు చేయాలని కోరగా, వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను తొలగించి జీ ప్లస్-1 పద్ధతిలో నూతన కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని, ఇందుకు రూ.30 లక్షలను వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కాలనీలోని ఒక వీధిలో తరచూ డ్రైనేజీ లైన్ స్తంభించి రోడ్డు పైకి మురుగునీరు చేరుతుందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే డ్రైనేజీ లైన్ పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఈఈ ఇందిర, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఖలీల్‌బేగ్, సరఫ్ సంతోష్, సురేష్‌గౌడ్, శేఖర్, పాజిల్, కరీం, పుష్పలత పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అడ్డగుట్ట: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడుతాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్స్‌లో శనివారం 30వ ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్ పోటీల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆగస్టు 17న ప్రారంభమైన పోటీలు శనివారంతో ముగిసాయి. ఏకే. జైన్ మాట్లాడుతూ.. రైల్వే సహకారంతో ఆర్గనైజింగ్ కమిటీ కచ్చితమైన ప్రణాళికతో పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్, షీల్డ్ అందజేశారు. ముగింపు వేడుకల్లో ఏజీఎం ధనంజయులు, ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్, సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్‌కుమార్, హైదరాబాద్ డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్ పాల్గొన్నారు.



చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా ఏర్పాట్లు జరుపుతున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని మెట్టుగూడ డివిజన్‌కు చెందిన మనుసాహు, మహమూద్ గూడకు చెందిన జాహిబ్ ఉన్నీసాలకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరంకృష్ణారావు



బేగంపేట డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు చేపట్టిన పాదయాత్ర 16వ రోజు శనివారం బేగంపేట డివిజన్‌లో కొనసాగింది. ప్రకాష్‌నగర్ శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అనే దానిపై ఆరా తీశారు. ప్రకాష్‌నగర్‌లో రూ.39 లక్షలతో చేపట్టిన సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణం, రూ.20 లక్షలతో ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ వద్ద సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతంలో ఉన్న బేగంపేటలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎస్ఎన్‌డీపీ కింద రూ.45 కోట్ల రూపాయలతో నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇక్కడి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఇప్పటికే కొంత పరిష్కారం చూపగలిగామని, భవిష్యత్తులో పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, విశాల్ సూదం, నరేష్, సత్యనారాయణ, రఘు, సామల పాండు, కేవీఆర్ రాజు, గోవిందరావు, బంగారు శ్రీను, జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ డీజీఎం శశాంక్ పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్టకు సాయిబాబాకు ఆహ్వానం

లాలాపేట: లాలాపేట బొడ్రాయి ఉత్సవ కమిటీ నాయకులు శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబాను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 21న లాలాపేటలో నిర్వహించనున్న బొడ్రాయి పునఃప్రతిష్ట భూమి పూజ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయి బాబ బొడ్రాయి ఉత్సవాలకు రూ 1,01,116 విరాళం చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు అశోక్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, రవి, మోహన్, మల్లికార్జున్, రమేష్, బాలి, అశోక్, సురేష్, అనీల్ పాల్గొన్నారు.



నాగులూరి సాయిబాబాను కలిసిన నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కంటోన్మెంట్: తిరుమలగిరి మండల పరిధిలోని సర్వే నంబర్ 157/1 లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మార్పీస్ నేతలు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో తిరుమలగిరి రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరుమలగిరి మండల పరిధిలో రెవెన్యూ అధికారులు మారిన ప్రతీసారి కబ్జాదారులు ఆక్రమణలకు యత్నిస్తున్నారని తాజాగా ఈ స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కొందరు వివాదాస్పద స్థలంలో గుడి నిర్మాణానికి పూనుకోవడం శోచనీయం అన్నారు. ఇది గమనించిన రెవెన్యూ అధికారులు స్పందించి అడ్డుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. పదే పదే కబ్జాకు యత్నిస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో ఇటుక గోపి మాదిగ, కళ్యాణ్ అజిత్, రాజు, శ్రీను, నర్సింహా, మక్కల అశోక్, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి




హమాల్‌బస్తీలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పద్మారావునగర్: హమాల్‌బస్తీ మురికివాడలో డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలు ఎమయ్యాయని.. ఇళ్ల నిర్మాణం పేరిట బీఆర్‌ఎస్ నాయకులు ఇక్కడి ప్రజలను మోసం చేశారని టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి ఆరోపించారు. ఇళ్ల నిర్మాణం కోసం 2015లో స్థానిక మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వేసిన శిలాఫలాకాన్ని చూపి ఎద్దేవా చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ.. మోసపూరితమైన వాగ్దానాలు, హమీలతో దగా చేస్తున్న బీఆర్‌ఎస్‌ను రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలందరికి ఇళ్లను కట్టిస్తామన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. దివ్యాంగుడైన ఓ విద్యార్థి అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, రాజు, ఎస్. విఠల్, వేదప్రకాశ్, శివలాల్, వెంకటేష్, క్రిష్ణా, నరేష్, నర్సింగ్‌రావు, ప్రసన్న, శ్రీను, కాశీ పాల్గొన్నారు.

హెల్త్‌సెంటర్ సమస్యలను పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు జీవన్ శనివారం పేర్కొన్నారు. వైద్యులు, ఇతర సిబ్బందితో పాటు అన్ని రకాల వ్యాధులకు మందులను రోగులకు ఇవ్వాలన్నారు. ఓయూ హెల్త్ సెంటర్ సమస్యలు తీర్చకుండా మాణికేశ్వర్‌నగర్ ఆసుపత్రికి 2 ఎకరాల స్థలం ఇవ్వడం దారుణమన్నారు. విద్యార్థులకు కావాల్సిన హాస్టళ్ల, అధునాతన లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాలలను నిర్మించాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు. ఓయూ స్థలంలో నిర్మాణాలు చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించారు.



చిన్నారి చికిత్స సహాయార్థం చిత్ర కళా ప్రదర్శన



సనత్‌నగర్: గుండె, లివర్ సమస్యలతో బాధపడుతూ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అత్తాపూర్‌కు చెందిన 12 ఏళ్ల ఓ బాలుడి సహాయార్థం బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో శనివారం చారిటీ చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీఎస్‌ఎల్ విజువల్ ఇంటర్నేషనల్ ఆర్ట్ గ్యాలరీ, సహాయ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో చిత్రకారులు తమ చిత్రాలు, మహిళలు, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శన ద్వారా సమకూరే ఆదాయాన్ని బాలుడి శస్త్ర చికిత్స కోసం వినియోగిస్తామని అనితహరి తెలిపారు. బాలుడి శస్త్ర చికిత్సకు సుమారు రూ.40 లక్షల ఖర్చవుతుందని, ఇందుకు తమవంతు సహకారం అందించడం ప్రదర్శన ఉద్దేశమన్నారు. అంతక ముందు చిత్ర కళా ప్రదర్శనను సంఘ సేవకురాలు పార్వతిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుధాజైన్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునః నిర్మాణ పనులు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న పాండుయాదవ్ దంపతులు

కంటోన్మెంట్: న్యూ బోయిన్‌పల్లి నందమూరి నగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయ పునః నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, విద్యావతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ.. స్థానికుల కృషి, పరస్పర సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మించాలని నిర్ణయించామన్నారు. పలువురు దాతల సహకారంతో అతి త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. పూజల్లో మర్రి రాజశేఖర్ రెడ్డి, గజ్జెల నాగేశ్, మన్నె క్రిశాంక్, జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, శ్రీనివాస్ యాదవ్, శ్యామ్ గౌడ్, ఉమాకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

విధేయులకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాతి రామకృష్ణ

కంటోన్మెంట్: పార్టీ విధేయులకే కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ లీగల్ సెల్ మాజీ కన్వీనర్ నాతి రామకృష్ణ అన్నారు. శనివారం మారేడుపల్లిలోని తన కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత డి. సంజీవరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పీసీసీ నాయకత్వం సూచించిన మేరకు కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం తాను దరఖాస్తు చేసుకున్నానని 22 రెండేళ్లుగా పార్టీలో వివిధ హోదాల్లో కొనసాగుతూ సేవలు అందించానని అన్నారు. ఈ నేపథ్యంలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా కోరానన్నారు. పార్టీ తరపున టికెట్ ఆశిస్తున్న వారు పది మందికి పైగా ఉన్నారని టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపుకోసం అందరూ కలిసి పనిచేయాలని అధిష్టానం సూచించిందన్నారు. ఈ నిబంధనలకు లోబడి, పార్టీ విధేయులుగా ఉండే వారికే అధిష్టానం అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న కావ్యారెడ్డి, సుచిత్రశ్రీకాంత్

బన్సీలాల్‌పేట్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే సమాజం ప్రగతి పథంలో ప్రయాణిస్తుందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కావ్యారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు తమ శక్తి సామర్థ్యాలను చాటుకోవాలన్నారు. ఇంటి వరకే పరిమితం కాకుండా అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని సూచించారు. కార్పొరేటర్ చీర సుచిత్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాంగోపాల్‌పేట్ డివిజన్ లో మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి వీలుగా పలు అంశాల్లో శిక్షణనిచ్చి ప్రోత్సాహిస్తున్నామన్నారు. పలు అంశాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న కవిత, లక్ష్మీ, సుజాత తదితరులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వారాసీగూడ పోలీస్‌స్టేషన్ ప్రారంభం



పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ సునీల్‌దత్

బౌద్ధనగర్: చిలకలగూడ ఏసీపీ కార్యాలయంలో కొంతకాలంగా కొనసాగుతున్న వారాసీగూడ పోలీస్టేషన్‌ను అదే భవనంలోని కింది అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేశారు. శనివారం ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ నూతన స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రజల రక్షణకై పోలీసు యంత్రాంగం దినదినం సాంకేతిక పరిజ్ఞానంతో మరింత ముందుకు సాగుతుందన్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు కూడా కనీసవసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం లిఫ్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, డీసీపీ సునీల్ దత్, ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐలు శంకర్, మట్టం రాజును శాలువాలతో సత్కరించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని వెంకటరామిరెడ్డి నగర్‌కు చెందిన కడమంచి శంకర్ (49) ప్రైవేటు ఉద్యోగి. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం 9.30 గంటల సమయంలో గుండ్లపోచంపల్లి-మేడ్చల్ రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బీసీలపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న బీసీ శక్తి సంఘం ప్రతినిధులు

కంటోన్మెంట్: బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు తగదని బీసీ శక్తి సంఘం అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్ అన్నారు. బీసీ శక్తి సంఘం కన్వీనర్ నాగుల శ్రీనివాస్ యాదవ్ వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి మారేడుపల్లిలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీబంధు పథకాన్ని జూన్‌లో ప్రకటించినా నేటికీ లబ్ధిదారులకు చెక్కులు అందజేయలేదన్నారు. అదే ఈ నెలలోనే ప్రకటించిన మైనారిటీ బంధు పథకం కింద చెక్కులు పంపిణీ జరిగిపోయిందన్నారు. తక్షణమే బీసీ బంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రజక, ముదిరాజ్, పెరిక, గౌడ, బొందిల, యాదవ, బోయ నాయీ బ్రాహ్మణ, పద్మశాలీ, బెస్త, కుమ్మరి, కాపు, కమ్మరి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తార్నాకలో ట్రాఫిక్ జాం

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రధాన రహదారుల్లో శనివారం రాత్రి తీవ్రమైన ట్రాఫిక్ జాం నెలకొంది. తార్నాక నుంచి మెట్టుగూడ వైపు, హబ్సిగూడ వరకు, తార్నాక చౌరస్తా నుంచి లాలాపేట ప్రధాన రహదారిలో భారీ సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. గంటల తరబడి వాహనదారులు రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది. ట్రాఫిక్ క్లియరెన్స్‌కు ట్రాఫిక్ పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజంతా చలాన్లు కోసం రోడ్లపై ఉన్న పోలీసులు రాత్రి సమయంలో ట్రాఫిక్ జాం ఏర్పడితే పత్తాలేకుండా పోతున్నారన్నారు.